❖•❖•❖ 29 ❖•❖•❖

# గాయపర్చబడి రక్తము కారుచుండిన వీపు

*“అప్పుడతడు వారు కోరినట్టు బరబ్బను వారికి విడుదల చేసి, యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయ నప్పగించెను” (మత్తయి 27:26).*

భక్తిభావంతో కూడిన సంయమనంతో, మత్తయి (27:26), మార్కు (15:15), మరియు యోహాను (19:1) యేసు కొరడాలతో కొట్టబడ్డాడని పూసగుచ్చినట్లు వర్ణిస్తున్నారు. శ్రమ నొందు సేవకునికి సంబంధించి ఒక గొప్ప వాక్యభాగములో, “మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది” అని యెషయా ప్రవచన రీతిగా పలికాడు (యెషయా 53:5బి). క్రీస్తు శ్రమలను వర్ణిస్తూ, “కొట్టువారికి నా వీపును అప్పగించితిని, వెంద్రుకలు పెరికివేయువారికి నా చెంపలను అప్పగించితిని” అని కూడా యెషయా విశదంగా ఆకర్షణీయమైన చిత్రపటమువలె ఉండిన ప్రవచనాన్ని వ్రాశాడు (యెషయా 50:6). యేసు యెరూషలేమునకు చివరిసారి వెళ్లవలసిన సమయము ఆసన్నమగుచుండగా, ఆయన తన అపొస్తలులకు, తన శ్రమల జాబితాలో ఆయన కొరడాతో కొట్టబడునను విషయాన్ని చేర్చుచూ, ఆ పట్టణంలో జరుగనై యుండిన సంఘటనల వివరాలను, విశదంగా తెలియజెప్పాడు:

> ... “ఇదిగో, మనము యెరూషలేమునకు వెళ్లుచున్నాము, మనుష్యకుమారుని గూర్చి ప్రవక్తలచేత వ్రాయబడిన మాటలన్నియు నెరవేర్చబడును. ఆయన అన్యజనుల కప్పగింపబడును, వారు ఆయనను అపహసించి, అవమానపరచి, ఆయన మీద ఉమ్మివేసి, ఆయనను కొరడాలతో కొట్టి చంపుదురు; మూడవ దినమున ఆయన మరల లేచునని చెప్పెను” (లూకా 18:31-33).

పిలాతు, కుయుక్తితో కూడిన దృఢ సంకల్పం కలిగియుండిన ప్రధానయాజకులు మరియు ప్రజల పెద్దలచేత ఎత్తుకు పై ఎత్తు వేయబడి మోసగింపబడినవాడై, తానొక వలలో చిక్కుకొనిపోయాడని తెలుసుకొన్నాడు. ఆయనతోపాటు, తప్పొప్పులు మంచిచెడులు సహితము ప్రక్కకు పారవేయబడ్డాయి. ఒక ప్రభుత్వాధికారిగా, న్యాయము చేకూర్చాల్సిన బాధ్యత ఆయన

భుజములపై ఉండినది; కానీ పరిస్థితులేవైనా, శాంతిసమాధానాలు అమలులో ఉండాలని ఆయన తన నైతికన్యాయవర్తనను అందు నిమిత్తము తాకట్టుపెట్టాడు. ఆయన ఇచ్చిన తొలి తీర్పు స్పష్టంగా ఉండింది: "ఈ మనుష్యుని యందు నాకు ఏ నేరమును కనబడలేదు" (లూకా 23:4). ఏది ఏమైనా, అల్లరి మూక వలన ఎదురగుచుండిన ఒత్తిడి ఆ యుక్తమైన తీర్పును వెనుకకు నెట్టివేసి ఆయన తన మనస్సునంతా దొమ్మిగా వచ్చుచుండిన జనసమూహముపై కేంద్రీకరింపజేసింది.

ఆగ్రహంతో నిండియున్న అల్లరిమూకను సంతృప్తిపరచు ప్రయత్నంలో, ఆయన బరబ్బను, ఏ విషయంలోనైతే ప్రధానయాజకులును ప్రజల పెద్దలును యేసును నిందించిరో అదే నేరమును గూర్చి దోషియైనవానిని, విడుదల చేశాడు. పిలాతు జారీ చేసిన శాసనాన్నిబట్టి, దోషియైన వాడు విడుదలచేయబడి, నిర్దోషియైనవాడు యేసు సిలువవేయబడును.

అల్లరి చేయుచుండిన జనసమూహాన్ని అదుపు చేయుటకు యేసును కొరడాలతో కొట్టించుట ఒక చక్కని విధానమని పిలాతు అనుకొన్నాడు. "ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు. కాబట్టి నేనితనిని శిక్షించి విడుదల చేయుదును" అని వారితో చెప్పాడు (లూకా 23:15బి-17). యేసును, ఎక్కడికక్కడ నుగ్గునుగ్గుచేయబడిన వీపుతోను రక్తసిక్తమై యుండిన శరీరముతోను ఉండినవానిని చూస్తేనే, ఆయనను సిలువవేయవలెనని తృష్ణగొనియుండిన వారి దాహము తీరవచ్చునని పిలాతు అనుకొన్నాడు. ఆయన మరలా, "ఇతనియందు మరణమునకు తగిన నేరమేమియు నాకు అగపడలేదు గనుక ఇతని శిక్షించి విడుదల చేతును" అని వారితో చెప్పాడు (లూకా 23:22). అట్లయినను లేశమైనా చలించని మనస్సుతో, వారు, "వీనిని సిలువవేయుము, సిలువవేయుము" అని ఒకే పట్టుగా పెద్దగా కేకలు వేశారు (లూకా 23:21, 23). ఆయన వారి ఇష్టప్రకారమే చేయుట తప్ప మరేదియును చేయజాలడని పిలాతు తెలిసికొనునంతవరకు వారు యేసు సిలువవేయబడవలెనని కలిగియుండిన వారి పట్టుదలను వదలలేదు. పిలాతు ఇచ్చిన తుది తీర్పు ఎక్కువగా వారి దబాయింపులను అర్థాంగీకారముగా సమ్మతించుటయే గాని వేరే ఏమీ కాదు. "కాగా వార డిగినట్టే జరుగవలెనని పిలాతు తీర్పుతీర్చెను" అని వాక్యభాగము చెప్పుచున్నది (లూకా 23:24). "అప్పుడు సిలువవేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను" అని యోహాను వ్రాయుచున్నాడు (యోహాను 19:16). పిలాతు రోమా ప్రభుత్వమునకు చెప్పుకోదగినంత ఎక్కువగా అనుకూలంగా లేకుండెను, ఇప్పుడు పస్కా పండుగ సమయంలో చెలరేగుచుండిన తిరుగుబాటును అదుపుచేయలేని ప్రమాదంలో పడ్డాడు. ఆయన యెదుట ఒకే ఒక కార్యచరణ మార్గం కనబడింది: అల్లరి మూక దబాయింపులకు ఆయన లొంగిపోవాలి, తత్ఫలితంగా, పిలాతు తన ఖైదీ చేత ఖండింపబడినవాడు అని చరిత్రలో గుర్తింపు పొందాడు.

యేసు సిలువవేయబడుటకు సిద్ధపాటుగా ఆయన కొరడాలతో కొట్టబడవలెనని పిలాతు ఆజ్ఞాపించాడు. వాటి బీభత్సం ఎలా ఉంటుందో తెలిసికొనుటకు కొరడా దెబ్బల గూర్చి మనకు చాలినంత తెలియును. ఒక్కొక్క తోలు పట్టీకి అస్తవ్యస్త ఆకారములో ఉండి మొనలు తేలిన ఎముకల ముక్కలు మరియు లోహపు ముక్కలు అమర్చిన తొమ్మిది తోలు పట్టీలను ఒకటిగా చేసి ఒక చివర కఱ్ఱ పిడికి కట్టి దానిని ఒక కొరడాగా ఉపయోగించారు. కొరడా దెబ్బలు కొట్టబడుట, రోమా పౌరడు, వాని పౌరవత్వ ప్రత్యేకార్హతనుబట్టి, ఇటువంటి శిక్ష నుండి మినహాయింపబడునంత భయంకరమైనదై యుండినది. ఆ కొరడా దెబ్బలు, "యే

మనిషిరూపముకంటె అతని ముఖమును, నరరూపముకంటె అతని రూపమును చాల వికారమగునంతగా" యేసు సహించాడని ఆయన గూర్చి ప్రవచనరీతిగా చెప్పబడునంత కఠోరమైనవిగాను భయంకరమైనవిగాను ఉండినవి. ఈ వాక్యభాగమునకు మొఫ్ఫట్ గారి అనువాదము ఇలా ఉన్నది: "ఆయన యిక మనిషే కాడన్నట్లు అగుపించునంతగా కురూపి అయ్యాడు" (యెషయా 52:14ఎ).

ప్రభువు బహుశ అర్ధనగ్నంగా ఒక కొయ్య స్తంభానికి తోలు పట్టీలతో కట్టివేయబడి యుండవచ్చును. ఒకరికి విధింపబడు కొరడా దెబ్బల సంఖ్యను హెబ్రీ శాసనం పరిమితం చేసింది, కానీ రోమా చట్టానికి యిటువంటి నియమాలేవీ లేవు. నిర్దయులును మనస్సు మొద్దుబారినవారునైన రోమా సైనికులు యేసు వీపు గాయములతో కమిలిపోయి, చర్మమంతా చీల్చబడి, చిరిగిపోయి, దెబ్బలచేత అంతా వాచిపోయి, కారిన రక్తమంతా ఆరిపోయి బిళ్లల వలె అతుక్కొని యుండినది. కొరడా దెబ్బలు కొన్ని పర్యాయాలు ప్రాణాంతకమైనవై యుండినవి. మనము ఈ విషయమై తలంచుచుండగా, మన ప్రభువు అనుభవించిన మరీ పాశవికమైన వివరాలపై పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడిన ముగ్గురు రచయితలు, మత్తయి, మార్కు, మరియు యోహాను కప్పినట్లుగా, తెరను కప్పుటయే బహుశ ఉత్తమమైన పని.

*యేసు కొరడా దెబ్బలు కొట్టబడుట మరియు సిలువవేయబడుటలో, మానవ పైశాచిక దౌష్ట్యము మరియు క్రూరత్వమంతా బయటపడుటను మనము చూడనగును.* దేవుని కుమారుడు రక్తమునే ఒక పైవస్త్రముగా ధరించుకొన్నాడా అని అగుపించునంత మేరకు దెబ్బలు కొట్టబడుచున్న భయంకరమైన దృశ్యాన్ని మనము గమనించుచుండగా, కనికరమే లేకుండా కఠోరమైనదిగా ఉండిన మానవ స్వభావాన్ని మనము చూడవచ్చును. ఈ ధరిత్రిపై కాలూని ఎప్పుడైనా సంచరించిన అత్యంత పవిత్రమైన, సాధువునైన, మరియు మనోహరమునైనవాడు ఒక ఘోరాతి అపరాధి కంటే ఘోరంగా వ్యవహరింపబడ్డాడు; నేరస్తులలో ఘోరాతి ఘోరమైన నేరస్థుని వలె చూడబడ్డాడు. మానవుని దుర్మార్గము చేత నరకము యొక్క ఆగ్రహావేశం యేసుపై చూపబడింది.

*మన ప్రభువు కొరడా దెబ్బలు కొట్టబడుటను మనము గమనించుచుండగా, మన రక్షణ కొరకు యేసు తన శరీరాన్ని అప్పగించుకొన్నాడను ఒక విశదమైన జ్ఞాపికను మనము చూడగలము.* ఆయన మన వంటి శరీరము కలిగియుండి, దానిని మన పాపము కొరకు సంపూర్తిగా సమర్పించుకొన్నాడు. ఆయన శిష్యులు ఆయన మరణమును జ్ఞాపకమునకు తెచ్చుకొందురను నమ్మకముతోను యేసు ప్రభుభోజన సంస్కారమును స్థాపించినప్పుడు, ఆయన ఒక రొట్టె పట్టుకొని, దానినాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి, "మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరము" అని చెప్పాడు (మత్తయి 26:26). ఆయన శరీరము మన కొరకు సిలువవేయబడుట మాత్రమే గాక, ప్రతి పాపి నిమిత్తము కూడా అది దెబ్బలు తిన్నది, దూషింపబడినది, మరియు యాతన పెట్టబడి బలమైన గాయములు చేయబడినది.

*ఈ కొరడా దెబ్బలలో, యేసు యొక్క బలియాగము సిలువకు ముందే ఆరంభమైనదని మనము గుర్తుచేయబడుచున్నాము.* మనము ఆయన మరణము గూర్చి ఆలోచించినప్పుడు, మనము సాధారణంగా జరిగిన మరణము గూర్చి ఆలోచిస్తాము, కానీ ఆ మరణము ఆరంభమయ్యింది అక్కడ కాదు. ఎవరునూ ఊహించుకొనలేనంతగా రక్తము కారుచు తీవ్రముగా శ్రమనొందునట్లు ఆయన కొట్టబడుటతోనే అది ఆరంభమయ్యింది. ఆయన

శరీరములో నుండి రక్తము కారుట, దిగగొట్టబడిన మేకుల వలన ఆయన హస్తములలోనుండి కారుటకు మునుపే మొదలైనది.

*ఆయన కొరడా దెబ్బలలో, ఇదివరకెన్నడు లేనివిధంగా, క్రీస్తు స్వభావము గూర్చిన ఒక చిత్రము మనముందు ఉంచబడియున్నది.* ఆయన యొక్క సాధుస్వభావమును మరియు ఆత్మనిగ్రహమును చూడండి. వధకు తేబడు గొఱ్ఱెపిల్లవలె ఆయన నడిపించబడ్డాడు ఆయన శ్రమనొందుచుండినప్పుడు, ఆయన ఏ పాపము చేయలేదు. ఆయన నోట ఏ కపటమును కానరాలేదు. “ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను” (1 పేతురు 2:22, 23). సాధువుగా, విధేయతతో, మరియు ప్రశాంతంగా, మన విమోచనార్థమై యేసు తన శరీరమును అపహాస్యమునకు, కొరడా దెబ్బలకు మరియు మేకులకును అప్పగించుకొన్నాడు.

*యేసు కొరడా దెబ్బలు కొట్టబడుట మనము యేసుకు చేసిన దానితో మనలను సరిక్రొత్త విధానంలో ఎదుర్కొనుచున్నది.* “మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను” అని పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 5:21) “... అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి” అని యెషయా చెప్పుచున్నాడు (యెషయా 53:5బి, 6ఎ). ఏ ఫిబిగర్ ఇలా వ్రాస్తున్నాడు:

> నీ పాపముల మూలముననే ఆయన ప్రశాంతంగాను సహనంతోను ఇంతగా శ్రమనొందాడు. ఆయనను యాతన అను కొయ్య స్తంభానికి కట్టివేసిన బంధకాలు నీ పాపముల చేత చేయబడినవే. ఆయనను దెబ్బలు కొట్టిన కొరడా అందమైన జడవలె నీ పాపముల చేత అల్లబడినదే, ఆయన పరిశుద్ధ నుదుటికి గ్రుచ్చుకొంటూ తలపై పెట్టబడిన ముళ్ల కిరీటము నీ పాపములు అను పురితో పేనబడిందే.[1]

మన రక్షణ కథ ఏ ఒక్క దానినైనను చేజారిపోనీయకూడని అనేక దశల గుండా కదలివెళ్తుంది. అది నేల పడుచున్న గొప్ప రక్తబిందువులను పోలిన చెమటతో, తోటలో మొదలౌతుంది. యేసు, చేతులు కట్టివేయబడి, ముఖముపై ఉమ్మివేయబడి పట్టబడుటతో కొనసాగుచు, తీర్పు గుండా, అపహసింపబడుచూ ముందుకు సాగుతుంది. ఆ తరువాత కథ కొరడా దెబ్బలు కొట్టబడుటతో, కొరడా చేత యేసు వీపు నుగ్గు నుగ్గు చేయబడుటతో కొనసాగుచూ, చిట్టచివరకు సార్వభౌమమైన సిలువమరణము శ్రమతో చరమావస్థకు చేరి ముగుస్తుంది.

❖◆❖◆❖

*ప్రభువు మన నిమిత్తము చేసిన బలియాగము గూర్చి నీవు ఆలోచించినప్పుడు, ఔను, ఆయన హస్తములు, పాదములు, మరియు ప్రక్క గూర్చి ఆలోచించుము. సిలువ, మేకులు, మరియు బల్లెము గూర్చి ఆలోచించుము; కానీ ఆయన వీపు గూర్చి కూడా ఆలోచించుము – ఏలయనగా, “అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది” అని యెషయా చెప్పుచున్నాడు (యెషయా 53:5బి).*

---

సూచన

[1]A. Fibiger, *A Study of the Passion of Christ;* quoted in Paul Stromberg Rees, *The Face of our Lord (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1951), 88.*